క్లుప్తంగా

మార్చి 6,7,8 తేదీల్లో పోలమాంబ జాతర

బాడంగి: మండల కేంద్రంలో పోలమాంబ జాతర నిర్వహణకు ఏర్పాట్లు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే జాతరకు సంబంధించి, ముహూర్తం నిర్ణయించి, చాటింపు కూడా చేపట్టారు. ఏటా శివరాత్రి తర్వాత నిర్వహించే ఈ జాతరను మార్చి 6, 7, 8వ తేదీల్లో చేసేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం గ్రామ శివారులోని అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. అంజలి రథానికి అవసరమైన గుజ్జు చెట్టును కూడా ఎంపిక చేయడం జరిగింది. ఆలయానికి వెళ్లే దారిని కూడా బాగు చేస్తుండడం గమనార్హం.

ఎంపీడీఓ సందర్శన

బొబ్బిలి రూరల్: మండలంలోని చిత్రకోటబొడ్డవలస గ్రామసచివాలయాన్ని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు, సచివాలయ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. జగనన్నకు చెబుదాం(స్పందన)లో వచ్చిన ఫిర్యాదులు, వినతులను ఏ మేరకు పరిష్కరించారో చూసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని, ప్రతిరోజూ సమయానికి సచివాలయానికి రావాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు.

వైభవంగా రామయ్య తండ్రి సంబరాలు



రామయ్యతండ్రికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజాం: మండలంలోని ముద్దాడజోగివలస గ్రామంలో రామయ్య తండ్రి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అల్లు, బగ్గ కుటుంబీకులు ఈ సంబరాలు చేయగా, మంగళవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, కొయ్యాన భాస్కరరావు ఈ సంబరాల్లో పాల్గొని, రామయ్య తండ్రికి ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా అలరించాయి.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం పనికిరాదు



ధాన్యం కొనుగోలు వివరాలపై ఆరాతీస్తున్న మండల ప్రత్యేకాధికారి జమదగ్ని

రాజాం: ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం పనికిరాదని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. మంగళవారం మండలంలోని అంతకాపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించి, ఈ-క్రాప్ నమోదు, ట్రక్ సీట్ల కేటాయింపులపై ఆరాతీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 13,200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. మరో 2 వేల మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, వ్యవసాయ శాఖ అధికారి రేణుకాసాయి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.నవ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు అందించాలి

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి మంగళవారం పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల హాజరుపై పంచాయతీ కార్యదర్శి కృష్ణను ఆరాతీశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకే అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలతో సక్రమంగా మెలగాలని, వీలైనంత త్వరగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, పీఎం జేఏవై ఈకేవైసీ చేయించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల పరిశీలనలో ఆర్డీఓ శేషశైలజ, ఇతర అధికారులు

బొబ్బిలి: పట్టణంలోని రాజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ పి.శేషశైలజ, పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు కలిసి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల అనంతరం చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజాం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు తిలక్

రేగిడి: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపాడు జంక్షన్ వద్ద మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారు రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో పాటు వలంటీర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలంతా సమష్టిగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలని కోరారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతీ మంచి పనిని విమర్శిస్తూ ప్రతిపక్ష టీడీపీ దాని అనుకూల ఎల్లోమీడియా చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఏది వాస్తవం, ఏది అవాస్తవమో ప్రజలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైఎస్సార్ సీపీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిందని, అలాగే ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన టార్గెట్-175(రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు 175 స్థానాలు గెలవాలి)ను చేరుకునేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం రాజాం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పేరాడ తిలక్ చేతులమీదుగా మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వి.జగన్‌మోహనరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతర ముగిసే వరకు..రెండు పూటలా పారిశుద్ధ్య పనులు

రాజాం: పట్టణంలో ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జాతర జరిగే రోజుల్లో ప్రతిరోజూ రెండు పూటలా పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం సారధి రోడ్డులో నెలకొన్న పారిశుద్ధ్య పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేపట్టి, బ్లీచింగ్ చల్లాలన్నారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. జాతర సందర్భంగా వేలాది మంది బంధువులు, స్నేహితులు పట్టణానికి వస్తారని, చెత్త నిల్వలు, వ్యర్థాలు ఎక్కువయ్యే పరిస్థితి ఉందని, వాటిని సకాలంలో తొలగించాలని కోరారు.

ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈకి సన్మానం



ట్రాన్స్‌కో ఎస్ఈని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

బొబ్బిలి రూరల్: స్థానిక ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయంలో ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ పి.నాగేశ్వరరావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకుని, తొలిసారి బొబ్బిలి విచ్చేసిన నేపథ్యంలో ఆయనను 1104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.దేముడు, జిల్లా అధ్యక్షుడు వి.లక్ష్మణరావుల ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎస్ఈని సత్కరించారు. కార్యక్రమంలో డీఈఈ పూడి హరి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లు ఏర్పాటు



గూడెపువలసలో పాతిన సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు

బాడంగి: భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని గూడెపువలస గ్రామంలో సరిహద్దు రాళ్ల ఏర్పాటును తహసీల్దార్ బాలమురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 22 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిందని, వీటిలో 13 గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలానికి ఇంతవరకు 8,100 సర్వే రాళ్లు రాగా, వాటిలో 2,800 వరకు ఉపయోగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు, డీఐఓఎస్ కె.నారాయణరావు, మండల సర్వేయర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మెంటాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అన్ని విభాగాల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థికి అభినందనలు

వంగర: మండల పరిధిలోని అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఐక గోవిందరావును హెచ్ఎం వి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కలిసి మంగళవారం అభినందించారు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో గోవిందరావు విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థిని సిబ్బంది మెచ్చుకున్నారు.

సంగమేశ్వరుని సేవలో ఎంపీ బెల్లాన



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వంగర: మండలంలోని సంగాంలో ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ, ప్రధానార్చకులు పూర్ణకలశంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం వద్ద ఎంపీ ప్రత్యేకాభిషేకాలు చేశారు. ప్రధానార్చకులు సిద్ధాంతం గణపతి ఆలయ సంప్రదాయం ప్రకారం వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. ఎంపీ మాట్లాడుతూ ఎంతో పురాతనమైన, విశిష్టత కలిగిన ఆలయాభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కె.ఉమామహేశ్వరరావు, ఆలయ చైర్మన్ బి.ఆనందరావు, ఈఓ పి.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన



కోడిగుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: మండలంలోని వీవీఆర్‌పేటలో వివిధ పాఠశాలలకు సరఫరా చేసే కోడిగుడ్లు, చెక్కీల స్టాక్‌పాయింట్‌ను ఎంఈఓ వై.దుర్గారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వస్తువుల నాణ్యత గమనించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జేకే గుమ్మడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై, విద్యాప్రమాణాల మెరుగునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు గుడివాడ నాగభూషణదొర, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం



ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీ చంద్రరావు

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం లభిస్తుందని వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఆనందరావు అన్నారు. మంగళవారం స్థానిక రైతుబజారులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రసాయన ఎరువులతో పండించిన పంటలను తీసుకోవడం వల్ల అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకే ఈ దుకాణం ఏర్పాటు చేశామన్నారు. రాజాం పరిసర ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన అన్ని రకాల ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. పరిసర గ్రామాల ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎండీ కిరణ్, శారద, అప్పలనాయుడు, రమాదేవి, వెంకటరమణ, రేణుక, నారాయణమ్మ, ఐసీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. హెటిరోడ్రగ్స్, గ్రావిటీ ఫార్మా, అరబిందో ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలకు 27 ఏళ్ల వయసు నిండిన పురుష అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ పూర్తి చేసిన వారు అర్హులని, ఎంపికైన వారికి 45 రోజుల పాటు శిక్షణ అందించి, ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు.

గడువులోగా భూముల రీసర్వే పూర్తి చేయాలి



నెమలాంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని నెమలాం గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయ సర్వేయర్లు, రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భూముల సరిహద్దుల గుర్తింపులో తప్పనిసరిగా రైతులను దగ్గర ఉంచి సరిహద్దులు గుర్తించాలని తెలిపారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో సంబరాలు జరుపుకోవాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగే గ్రామ దేవతల సంబరాలు, సిరిమానోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం సిబ్బందితో కలిసి గ్రామంలో సంబరాలు నిర్వహించే ప్రాంతాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. సంబరాల సమయంలో గ్రామస్తులు ఎవ్వరూ తగాదాలకు పాల్పడవద్దని కోరారు. అలాగే కోళ్ల, పొట్టేలు పందాలు, జూదం ఆడకూడదన్నారు. భద్రతా చర్యలకు ఆటంకం కలిగించినా, కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులతో పాటు ఎస్ఐ జ్ఞానప్రసాద్,ట్రాఫిక్ఎస్ఐ పోలినాయుడు,ఏఎస్ఐ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభించని ఇళ్లను రద్దు చేస్తాం

- బొబ్బిలి హౌసింగ్ డీఈఈ పలగర అప్పయ్య



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బొబ్బిలి హౌసింగ్ డీఈఈ అప్పయ్య

తెర్లాం: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు సంబంధించి, ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించని వారి ఇళ్లను రద్దు చేస్తామని బొబ్బిలి హౌసింగ్ డీఈఈ పలగర అప్పయ్య హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని జగనన్న కాలనీ ఇళ్ల లే-అవుట్ వద్ద లబ్ధిదారులతో మంగళవారం సమావేశమైన ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున భారీగా సామూహిక గృహ ప్రవేశాలు చేయించేందుకు సిద్ధమవుతోందని, ఈ నేపథ్యంలో ఆ సమయానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు కూడా విడతల వారీగా మంజూరు చేయడం జరుగుతోందని, బిల్లుల చెల్లింపుల్లో కూడా ఎటువంటి జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలగే జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో ‘నర్తు’ను గెలిపించాలి

- ఎమ్మెల్యే కంబాల జోగులు



ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును పార్టీ క్యాడర్‌కు పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: శ్రీకాకుళం జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన నర్తు రామారావు యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను నర్తు రామారావు కలిసి, ఈ నియోజకవర్గం నుంచి తనకు భారీ మెజార్టీ వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు నర్తు రామారావును పరిచయం చేసి, ఆయనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్.నరేంద్రయాదవ్, మాజీ ఎంపీపీ ఎస్.చామంతి పాల్గొన్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీ



ఓ రెస్టారెంట్‌లో స్వాధీనం చేసుకున్న సిలిండర్లను చూపిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్న హోటళ్లలో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన ‘డొమెస్టిక్ గ్యాస్ పక్కదారి’ అన్న వార్తకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో తనిఖీలను విస్తృతం చేసి, వాస్తవ నివేదిక అందించాలని సీఎస్‌డీటీల బృందాన్ని నియమించి, ఆదేశించారు. ఈ మేరకు బృందం సభ్యులు పట్టణంలోని ప్రతీ హోటలు, రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టి, అక్రమంగా వినియోగిస్తున్న 19 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. అలాగే ఏడుగురు హోటళ్ల యజమానులకు సంబంధించి, నివేదికను జేసీకి అందించనున్నట్లు బృంద సభ్యులు తెలిపారు. తనిఖీ బృందంలో రాజాం, చీపురుపల్లి, తెర్లాం, బొబ్బిలి, గజపతినగరం, గరివిడి మండలాల సీఎస్‌డీటీలు ఎస్.చిరంజీవిరావు, డీవీ రవిశంకర్, పి.రామారావు, సీహెచ్ శోభ, సాయికుమార్, భాస్కరరావు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్



మాట్లాడుతున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్

రాజాం సిటీ: విద్యార్థులు, యువత డ్రగ్స్(మత్తు పదార్థాలు) వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ సూచించారు. మంగళవారం స్థానిక ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌కు బానిసలైన యువత ఎలా పెడదోవపడుతున్నారనేది షార్ట్‌ఫిల్మ్ ద్వారా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చి, వారికి ఉన్న ఊరికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. డ్రగ్స్ విక్రయదారులు కూడా విద్యార్థులే లక్ష్యంగా చేసుకుంటున్నారని, జాగ్రత్తపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎవరో చెప్పారని సరదాగా ఒకసారి మత్తు పదార్థాలను అలవాటు చేసుకుంటే జీవితం నాశనమవుతుందన్నారు. మంచి భవిష్యత్ నిర్మాణం కావాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర, ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్, వైద్యులు రాజేంద్ర, ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి, ఎస్ఐ పి.సూర్యకుమారి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన బీసీలకు సముచిత న్యాయం చేసి, బీసీల పక్షపాతి అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారన్నారని ప్రశంసించారు. నేటికీ చట్టసభల్లో అడుగుపెట్టని కులాలను కూడా ఎమ్మెల్సీ పదవులిచ్చి ప్రోత్సహిస్తుండడం హర్షణీయమన్నారు. తాజాగా ప్రకటించిన 18 మంది ఎమ్మెల్సీల్లో 11 మంది బీసీలకు అవకాశం ఇవ్వడంతో పాటు మిగిలిన ఏడుగురులో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీలకు కూడా ప్రాధాన్యనివ్వడంతో సామాజిక న్యాయంలో కొత్త చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, నాయకులు డి.పైడిరాజు, కె.అప్పారావు, పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సన్నాహాలు



వివరాలు వెల్లడిస్తున్న హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు

రాజాం: ఉగాది నాటికి మండలంలోని జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలకు సన్నాహాలు చేస్తున్నామని హౌసింగ్ ఏఈ ఆర్.వేణుగోపాలరావు మంగళవారం తెలిపారు. మొత్తం 1,666 జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 765 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 397 ఇళ్ల నిర్మాణాలు పూర్తికి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా ఇళ్లల్లో గృహప్రవేశాలకు కూడా లబ్ధిదారులను సన్నద్ధం చేస్తున్నామన్నారు.

రీసర్వేతో భూ తగాదాలకు చెక్



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజారావు

బొబ్బిలి రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలకు చెక్ పడుతోందని తహసీల్దార్ ఎస్.రాజారావు తెలిపారు. భూముల రీసర్వేలో భాగంగా డ్రోన్ సర్వే పూర్తయిన మండలంలోని చిత్రకోటబొడ్డవలస గ్రామంలో గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు 9వ నంబర్ నోటీసులిచ్చారు. ఈ నోటీసులో వివాదాలు లేని రైతుల భూ వివరాలు నమోదై ఉన్నాయని, ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేస్తే వాటిని సరిచేస్తామని తహసీల్దార్ అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, సమస్యలు పరిష్కరించిన తర్వాతే శాశ్వత భూహక్కు పత్రాలు అందిస్తామన్నారు. గ్రామసభలో ఎంపీడీఓ ఎ.భాస్కరరావు, సర్వేయరు అప్పారావు, ఆర్ఎస్‌డీటీ జి.అప్పయ్య పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.భారతి తెలుగు భాష గొప్పదనం విద్యార్థులకు వివరించారు. అన్ని భాషల్లో కన్నా తెలుగు భాష చాలా గొప్పదని, ఎక్కడికి వెళ్లినా మన మాతృభాషను మర్చిపోకూడదన్నారు. ప్రతిఒక్కరూ తెలుగుపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.బలరామ్మూర్తి, కె.మధుసూదనరావు, శ్రీలక్ష్మి, ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి, గౌరీశంకరరావు, రవికుమార్, రాజా సురేష్, శారద పాల్గొన్నారు.

వలసల నివారణకే ‘ఉపాధి’ పనులు

- ఉపాధి పనుల పరిశీలనలో ఎంపీడీఓ త్రివిక్రమ్



మెంటాడ: ఉపాధి వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నాయని ఎంపీడీఓ త్రివిక్రమ్ అన్నారు. మండలంలోని కైలాం గ్రామ ఎర్రయ్య చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం వేతనదారుల హాజరు, వారికి అందుతున్న రోజువారీ వేతనాలపై ఆరాతీశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధి పని కల్పిస్తామన్నారు. రెండు పూటలా నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 గిట్టుబాటు వేతనం వస్తుందన్నారు.

సంతకవిటి: మండలంలోని ముకుందపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి మంగళవారం పరిశీలించారు. అనంతరం వేతనదారుల మస్తర్లు పరిశీలించి, జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు ఆహ్వానించాలని సూచించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.